ఉద్దానంలో వణుకు..!

■ ఇచ్ఛాపురంపైనే అధిక ప్రభావం చూపనున్న దానా



న్యూస్‌టుడే, సోంపేట

దానా తుపాను ప్రభావం ఇచ్ఛాపురం నియోజకవర్గంపై అధికంగా ఉంటుందనే సమాచారంతో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఉద్దానం, తీర గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. 1999లో అతి తీవ్ర తుపాను ఒడిశాలో తీరం దాటినప్పుడు ఈ ప్రాంతంలో 12 లక్షల కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. వేల ఎకరాల్లో జీడి తోటలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం దానా తుపాను సైతం ఒడిశాలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తిత్లీ తుపాను దెబ్బకు 16 లక్షల కొబ్బరి చెట్లు నాశనం కాగా 55 వేల ఎకరాల్లో జీడి తోటలు నామరూపాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఉద్దానంలో 40 వేల ఎకరాల్లో కొబ్బరి, 60 వేల ఎకరాల్లో జీడి తోటలు సాగు చేస్తున్నారు. పదేళ్ల తరువాత ఖరీఫ్‌లో వరి సాగు బాగుండటంతో అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. తుపాను ప్రభావం పడితే 80 వేల ఎకరాల్లో పంటకు ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. 2018 అక్టోబరులో తిత్లీ తుపాను సంభవించిందని.. అదే నెలలో దానా అతి తీవ్ర తుపాను సంభవిస్తుందనే సమాచారంతో రెండు నియోజకవర్గాల్లోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ క్షణాన ముప్పు వాటిల్లుతుందోనని మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ ఇళ్ల వద్ద కాలం వెళ్లదీస్తున్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు

● తుపాను పరిస్థితి అంచనాకు నియోజకవర్గానికో డ్రోన్
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఇచ్ఛాపురం నియోజకవర్గంపై అధిక ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదుల్లో నీటి ప్రవాహాలను గమనించాలి. నదీ తీర ప్రాంతాల్లో గట్లు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలి. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే కంట్రోల్ రూం పని చేస్తోంది. మండల స్థాయిలోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి. జిల్లావ్యాప్తంగా 5 వేలకు పైగా చెరువులు ఉండగా 1,004 గట్లు బలహీనంగా ఉన్నాయి. భారీ వర్షాలకు సామర్థ్యానికి మించి నీరు చేరితే అవి తెగిపోయే ప్రమాదముంది. 24 గంటల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలి. కంట్రోల్ రూంలో ఉండే సిబ్బంది వారికి కేటాయించిన విధులు నిబద్ధతతో నిర్వహించాలి. నియోజకవర్గానికి ఇద్దరు, తీర ప్రాంత నియోజకవర్గాల్లో మండలానికి ఒకరు, షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించి ఫోన్ ద్వారా వచ్చే సమాచారాన్ని నమోదు చేయించాలి. ప్రతి రెండు గంటలకు పూర్తిస్థాయి బులిటెన్ ఇవ్వాలి. గంట గంటకు జిల్లాలోని నదుల ప్రవాహ వేగాలను నమోదు చేయాలి. జిల్లాలో తుపాను పరిస్థితిని అంచనా వేయడానికి నియోజకవర్గానికి ఒక డ్రోన్, తీర ప్రాంత మండలానికి ఒకటి చొప్పున 20 డ్రోన్లు అందుబాటులో ఉంచాం' అని కలెక్టర్ వివరించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవోలు కె.సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, పంచాయతీ అధికారి భారతి సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలుదే పైచేయి..!

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల మైదానం వేదికగా రెండురోజుల పాటు జరిగిన 34వ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళలు, పురుషుల జట్లు ప్రతిభ చూపాయి. మహిళల విభాగంలో ప్రథమ, పురుషుల విభాగంలో తృతీయ స్థానాల్లో నిలిచాయి.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్


ట్రోఫీ అందుకుంటున్న మహిళా జట్టు

నింగిలో కనువిందు



బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను ప్రభావం కారణంగా జిల్లాలోని వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి వివిధ రంగుల్లో ఆకాశం కనిపించింది. సూర్యాస్తమయ వేళ నలుపు, తెల్లని మబ్బులతో ఉండే నింగి ఒక్కసారిగా ఊదా రంగులోకి మారింది. పలుచోట్ల ఈ రమణీయ దృశ్యాలను ప్రజలు తమ చరవాణుల్లో బంధించారు..లావేరు మండలం మురపాక గ్రామంలో కనువిందు చేసిన చిత్రమిది. - న్యూస్‌టుడే, పొందూరు, ఎచ్చెర్ల

ఇంత దారుణమా..?



ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలను కలిపే పాలకొండ- హడ్డుబంగి ఆర్‌అండ్‌బీ రహదారి దీనిది.. కొత్తూరు మండలం నివగాం వద్ద అత్యంత దారుణంగా మారింది. గత నాలుగేళ్లుగా ఇలాగే ఉన్నా వైకాపా పాలకులు పట్టించుకోలేదు. పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి దారిని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్ మాట్లాడుతూ వెంటనే బాగుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ఉన్నది కూల్చేశారు.. కొత్తది కట్టలేదు..



నాలుగు రేకుల మధ్య చదువుకుంటున్న ఈ చిన్నారులను చూడండి.. వజ్రపుకొత్తూరు మండలం లింగాలపాడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది.. ఇక్కడున్న పాఠశాల భవనం శిథిలమవడంతో వైకాపా పాలకులు కొత్త భవనం నిర్మిస్తామంటూ ఓ ఇంట్లోకి బడిని మార్చారు. ప్రస్తుతం ఆ ఇల్లు కూడా శిథిలం కావడం, ఉన్న ప్రభుత్వ భవనాన్ని కూల్చేయడంతో చేసేది లేక ఓ రేకులషెడ్డులో ఇలా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులోకి ఎండ తగలడంతో పరదాలు కడుతున్నారు. ఇక వర్షం పడితే బడికి సెలవే. అంగన్‌వాడీ బడి కూడా ఇక్కడే కొనసాగడం గమనార్హం. 'డీఎంఎఫ్ నిధుల కింద రూ.14 లక్షలు మంజూరై టెండర్లు పూర్తయ్యాయి. గుత్తేదారు పనులు చేయాల్సి ఉంది. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటాం' అని పంచాయతీరాజ్ ఏఈ నాగభూషణ్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

లక్ష్యం తుప్పల్లో కలిసిపోయింది..



ఈ చిత్రంలో పనికిరాని మొక్కలు కనిపిస్తున్నాయి కదూ.. వీటి వెనుక ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయండి.. స్వచ్ఛభారత్‌లో భాగంగా కోటబొమ్మాళి మండలం జర్జంగి కాలనీ సమీపంలో వీటిని నిర్మించారు. రూ.లక్షలు వెచ్చించారు సరే. అనుకున్న లక్ష్యం మరిచిపోవడంతో ఇలా దర్శనమిస్తున్నాయి. 15 కుటుంబాల కోసం ప్రణాళిక లేకుండా లోతట్టు ప్రదేశంలో చేపట్టిన నిర్మాణాలు కనీసం ప్రారంభానికి నోచుకోలేదు. నీటి సమస్య తలెత్తదని వంశధార ప్రధాన కాలువ పక్కన అప్పట్లో వీటిని ఏర్పాటు చేశారు. దీనిపై ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఎవరికీ పట్టని అమ్మ వేదన..!

● శ్రీనివాస్ అనే వ్యక్తి దేవుడి జన్మనక్షత్రంలో తన బిడ్డ జన్మించాలని ఆకాంక్ష. దీంతో భార్యకు ప్రసవం వచ్చేంతవరకు వేచిచూడకుండా ముందుగానే శస్త్రచికిత్స ద్వారా కాన్పు జరిపించారు.

● ఈశ్వర్ భార్య గర్భిణి. మరో వారంరోజుల్లో అమావాస్య ఉందని, శ్రావణమాసం దాటాక వచ్చే భాద్రపదం అంతగా అనుకూలించేదికాదని పేర్కొంటూ ప్రసవ తేదీకి పది రోజుల ముందే శస్త్రచికిత్స చేయించారు.


● శ్రీజ అనే గర్భిణి ప్రసవ వేదనతో పలాసలోని ఓ ఆసుపత్రిలో చేరింది. ఆమె భర్త వైపు కుటుంబ పెద్ద మరోవారం తర్వాత మాత్రమే మంచి ముహూర్తం ఉందని, అప్పుడు మాత్రమే ప్రసవం చేయాలని వైద్యులకు సూచించారు. అప్పటి వరకు ఆగితే బిడ్డ ఉమ్మనీరు మింగేసే ప్రమాదముందని, తల్లి ఆరోగ్యం సహకరించే పరిస్థితి లేదని హెచ్చరించినా ముహూర్తమే ముఖ్యమని వారంరోజులు ఆగాకే ప్రసవం చేయించారు.




..అమ్మతనం.. ప్రపంచంలో అపురూపమైన అవకాశం. ప్రతి మహిళ జీవితంలో తల్లిగా మురిసిపోవాలనుకుని నవమాసాలు ఎదురు చూస్తుంది. గర్భిణిగా తన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. కానీ ప్రసవ సమయంలోనే జరుగుతున్న తంతు ఆందోళనకు గురిచేస్తోంది. ప్రసవ వేదన అనుభవించలేక కొందరు.. ముహూర్తాల మూఢ నమ్మకంలో మరికొందరు.. వైద్యుల వ్యాపార దృక్పథంలో ఇంకొందరు శస్త్రచికిత్సల వైపే అడుగులేస్తున్నారు. రోజురోజుకూ సాధారణ ప్రసవాలు తగ్గిపోతుండగా సిజేరియన్ల సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ధోరణి మరింత దారుణంగా ఉంది.

- న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం, గుజరాతీపేట (శ్రీకాకుళం)

జిల్లాలో గత రెండేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల తీరు..



జనవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు జరిగిన కాన్పులను పరిశీలిస్తే..




టెక్కలి జిల్లా ఆసుపత్రిలో తల్లీ పిల్లల వార్డు

శస్త్రచికిత్స ప్రసవాలతో తల్లీ బిడ్డల ఆరోగ్యంపై ప్రభావం

ముహూర్త మూఢాచారాలతో వైద్యులపై ఒత్తిడి

ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపారం

బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం..

శస్త్రచికిత్స ప్రసవాలు తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువ ఉంటుందని, వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పుట్టిన కొద్దిసేపటికే తల్లిపాలు అందించే అవకాశం సాధారణ ప్రసవాలకే ఉంటుందని, దీని ప్రభావం బిడ్డ ఆరోగ్యంపై పడుతుందని పేర్కొంటున్నారు. ఎనస్తీషియా మొదలు శస్త్రచికిత్స జరిపే వరకు జరిగే ప్రక్రియ, రక్తస్రావం వంటివి తల్లి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రసవానంతరం గర్భసంచి, ఇతర అనారోగ్య సమస్యలు సిజేరియన్‌లో జరిగే లోపాల వల్లే ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

నిర్వాహకుల కమీషన్ ఎర..

శ్రీకాకుళం నగరం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట పట్టణాలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వీటి నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలను ఎరగా వాడుకుంటున్నారు. కాన్పులకు తమ వద్దకు తెస్తే వారికి ప్రత్యేకంగా నజరానాలు అందజేస్తున్నారు. శస్త్రచికిత్స చేస్తే వచ్చే కమీషన్ కోసం సిబ్బంది కూడా గర్భిణులకు సీజేరియన్ల వైపు వెళ్లేలా చూస్తున్నారు. వీటిని నివారించే ప్రభుత్వ వ్యవస్థ మిన్నకుండిపోతుంది తప్ప ఏమీ చేయలేకపోతోంది. అధికారులు సైతం సమీక్షలకే పరిమితమవుతున్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి...

జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వైద్యులను ఆదేశించాం. ప్రభుత్వ వైద్యాధికారులు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణుల కుటుంబ సభ్యుల్లో మార్పు రావాల్సి ఉంది. జాతకాలు, మూఢ నమ్మకాల కారణంగా ఒత్తిడి తీసుకురావడంతో కొంతవరకు వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తున్నారని సమాచారం. – బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌వో

ఆన్‌లైన్‌లో కేజీబీవీ నియామకాల ప్రతిభ జాబితా

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో బోధన, బోధనేతర పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సబ్జెక్టుల వారీగా ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ప్రతిభ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. http://sites.google.com/site/deosklorg/ వెబ్‌సైట్‌లో, సమగ్ర శిక్షా కార్యాలయ నోటీసు బోర్డులో పొందుపరిచామని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వయంగా సమగ్ర శిక్షా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎస్‌ఈఐఏఏ కమిటీ సభ్యురాలిగా బీఆర్‌ఏయూ రిజిస్ట్రార్ సుజాత నియామకం



ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ(ఎస్‌ఈఐఏఏ)కు నియమించిన కమిటీలో సభ్యురాలిగా జిల్లాలోని డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, బయోటెక్నాలజీ విభాగం ఆచార్యులు డా. పీలా సుజాత ఉన్నారు. ఈ సంస్థ వాతావరణ మార్పులపై తగిన సూచనలు, సలహాలు ఇస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కమిటీలో ఛైర్మన్, సెక్రటరీ, సభ్యులు మొత్తం 15 మంది ఉంటారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు అనుబంధంగా ఈ కమిటీ పనిచేస్తుంది. ఇందులో సభ్యురాలిగా సుజాత మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

మహిళా కానిస్టేబుల్‌తో ఎస్సై అసభ్యకర ప్రవర్తన!

ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: శాంతిభద్రతలను కాపాడుతూ ఆకతాయిల ఆగడాలను అరికట్టాల్సిన పోలీసు అధికారి చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన ఉదంతమిది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్‌పై అదే స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్సై స్థాయి అధికారి అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ సివిల్ తగాదా కేసు విషయమై వేరే ప్రాంతానికి వెళ్తుండగా ఆమె పట్ల అనుచితంగా వ్యవహరించగా అప్రమత్తమై బయట పడినట్లు సమాచారం. ఈ విషయమై బాధితురాలు ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. దీనిపై ఎస్పీని 'ఈనాడు' సంప్రదించగా 'ఈ విషయం నా దృష్టికి వచ్చింది. విచారణలో వాస్తవమని తేలితే సంబంధిత వ్యక్తిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

ఆ శనివారాల్లో పాఠశాలలు పనిచేయాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు రెండో శనివారం పని చేయాలని డీఈవో ఎస్.తిరుమలచైతన్య సూచించారు. సెప్టెంబరు 2, 9 తేదీల్లో భారీ వర్షాల కారణంగా సెలవు ప్రకటించినట్లు గుర్తు చేశారు. ప్రత్యామ్నాయంగా వచ్చే నెల 9, డిసెంబరు 7న పాఠశాలలు పని చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీల్లో.. ఆరోగ్యం..ఆహ్లాదం..ఆనందం

సక్షం పథకంలో 153 కేంద్రాలు ఎంపిక

● జిల్లాలో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 9,741 మంది గర్భిణులు, 11,044 మంది బాలింతలు, 0-6 ఏళ్ల లోపు వయసు ఉన్న చిన్నారులు 55,741 మంది ఉన్నారు.


ఎం.రుప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణవాటికకు స్థలం సిద్ధం చేస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, బలగ(శ్రీకాకుళం)

ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, ఆరోగ్యంపై అవగాహన, కిశోర బాలికల వికాసంతో సంపూర్ణ ఆరోగ్యవంత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఇందుకు తగిన వసతులు, సౌకర్యాలు లేక వందశాతం ఫలితాలు అందుకోలేక చతికిల పడుతున్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అడుగులేస్తోంది. మెరుగైన వసతుల కల్పన లక్ష్యంగా కేంద్రాల్లో 'సక్షం' (స్టిమ్యూలేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లాలో 14 ప్రాజెక్టుల పరిధిలోని 25 మండలాల్లో ఉన్న 153 అంగన్‌వాడీ కేంద్రాలు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యాయి.

పోషకాహారం.. శుద్ధ జలం

పోషకాల తోట(న్యూట్రి గార్డెన్) పేరిట ఎంపికైన కేంద్రాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. వాటిని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. రక్షిత మంచి నీటిని అందిచేందుకు శుద్ధి యంత్రాలు అమర్చనున్నారు. వీటి నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది.

ఒక కేంద్రానికి కేటాయించే నిధుల వివరాలు (రూ.)

పోషకాల తోటకు	- 10,000
ఇంకుడు గుంతలు	- 16,000
ఇతర సదుపాయాలు	- 19,800

సమకూరనున్న సదుపాయాలు

- తల్లీబిడ్డలు ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం
- విద్యా బోధన మెరుగుకు అవసరమైన చర్యలు
- పరిజ్ఞానం పెంపొందిచేందుకు కేంద్రంలో వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువుల ఏర్పాటు
- బల్లలు, కుర్చీలు, ఫర్నీచర్ అందుబాటులోకి తీసుకు రావడం
- ఆకట్టుకునే విధంగా బోధనకు, దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు ఉంచడం

మంచి ఆహారం అందిస్తాం ... జిల్లాలో 153 కేంద్రాలు సక్షం పథకానికి ఎంపికయ్యాయి. వీటిలో పోషక తోటలు, ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం నిధులు సైతం విడుదల చేసింది. కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణంతో పాటు పోషకవిలువలు కలిగిన ఆహారం అందిస్తాం. – బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్, పీడీ

సెపక్‌తక్రా విజేతలకు అభినందన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలక స్మృతి పార్క్ మైదానంలో మంగళవారం ప్రారంభమైన 34వ రాష్ట్ర స్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ, పశ్చిమగోదావరి ద్వితీయ, కర్నూలు, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జట్టు ద్వితీయ, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం సొంతం చేసుకున్నాయి. విజేతలను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పురపాలక మాజీ అధ్యక్షురాలు ఎంవీ పద్మావతి, సెపక్‌తక్రా జిల్లా ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.స్వరూప్, జి.అర్జున్ రావురెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.


రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పురుషుల జట్టు

కిల్లిపాలెంలో అడుగంటిన భూగర్భ జలాలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కిల్లిపాలెం పరిధిలో రీచ్‌ను బుధవారం భూగర్భ గనుల శాఖ అధికారులు పరిశీలించారు. 'ఇక్కడ రీచ్ నిర్వహించడంతో కిల్లిపాలెం పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీటి నాణ్యత కలుషితమై అనారోగ్యం బారిన పడుతున్నాం' అని ఇటీవల మీకోసం కార్యక్రమంలో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు రీచ్‌ను పరిశీలించారు. ఇసుక నిల్వలు నిండుకున్నాయని అధికారులు గుర్తించినట్లు సమాచారం. మైనింగ్ శాఖ డీడీ సి.హెచ్.మోహనరావు, ఆర్‌ఐ కె.మాణిక్యాలరావు తదితరులు ఆ ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో ఉన్నారు.


నాగావళి నది తీరాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు, గ్రామస్థులు

అత్యాచార ఘటనలో ముగ్గురికి రిమాండ్

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఈ నెల 19న రాత్రి కాశీబుగ్గకు చెందిన ముగ్గురు యువకుల్లో ఒకరి పుట్టిన రోజు వేడుక పేరిట ఇద్దరు బాలికలను ఆహ్వానించారు. కారులో బయలుదేరి ఓ ఇంటికి తీసుకెళ్లారు. వేడుక అనంతరం ఇద్దరు బాలికలపై సాయికుమార్ (ఐటీఐ మొదటి సంవత్సరం విద్యార్థి), రాధామోహనరావు (సీసీ కెమెరా మెకానిక్), శివ (ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు డ్రైవర్) అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటన జరిగిన ప్రాంతంలో మద్యం, శీతలపానీయం సీసాలు, సిగరెట్లు గుర్తించారు. పరువు పోతుందని బాధితులు పోలీసులకు ఆలస్యంగా విషయం చెప్పారు. ఈ నెల 21న ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు' అని ఎస్పీ వివరించారు.

సిక్కోలు యువకుడికి సీఎం ప్రశంస

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: అమరావతిలో జరిగిన డ్రోన్ ప్రదర్శనలో ప్రతిభ చూపిన సిక్కోలు యువకుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామానికి చెందిన యువకుడు శిమ్మ అజయ్‌కుమార్ ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదు పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు చెక్కు అందించి అభినందించారు. అజయ్ కుమార్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదువుతూనే డ్రోన్ల వినియోగం గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపేవారు. అలా ఆరేళ్ల పాటు ఆ విభాగంలో మెలకువలు నేర్చుకునేందుకు సాధన చేశారు. తాను తయారు చేసిన డ్రోన్ సుమారు 40 కిలోల బరువును 100 కి.మీ. వరకు తీసుకెళ్తుందని స్పష్టంచేశారు. ఇందులో త్రీడీ ప్రింటెడ్ సాంకేతికతను వినియోగించినట్లు పేర్కొన్నాడు. సిక్కోలు యువకుడు సాధించిన విజయం పట్ల తల్లిదండ్రులు జగన్నాథరావు, లక్ష్మి, గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అజయ్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఇతర నాయకులు

మహిళల రక్షణపై జగన్ మాట్లాడటం విడ్డూరం: శిరీష



ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: 'తల్లిని, చెల్లిని ఇంట్లో నుంచి బయటకు పంపి కేసులు పెట్టి కోర్టులకు ఎక్కించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మహిళల రక్షణ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది' అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'పలాస పురపాలక సంఘ పరిధిలో ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగిందని తెలిసిన వెంటనే బాధితులకు ఫోన్ చేసి ధైర్యంగా ముందుకు రావాలని సూచించాం. వారి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేగంగా స్పందించి నిందితులను అరెస్టు చేశారు. పలాసలో తెదేపా కుటుంబానికి చెందిన పిల్లలు ఈ దారుణానికి పాల్పడ్డారు.. మా ఇంట్లో ఈ విషయమై సెటిల్‌మెంట్ చేశామని జగన్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతున్నారు. దీన్ని నిరూపించకపోతే ఇద్దరూ గుండు కొట్టించుకుని మా ఇంటి ముందు నిల్చుంటారా? వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో ఇచ్చిన స్క్రిప్టు చదివితే జీవిత ఎన్నికల్లో వైకాపా వచ్చిన 11 సీట్లు భవిష్యత్తులో రావు. సుగాలి, అంబటి రాంబాబు విషయంలో వైకాపా ప్రభుత్వం ఏం చేసింది? దళితుడిని చంపిన అనంత బాబును పక్కన కూర్చోబెట్టుకున్న మీరు ఆ కేసులో ఏం చర్యలు తీసుకున్నారు? గోరంట్ల మాధవ్, నటి జెత్వాని కేసులో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? గత ఐదేళ్లలో పలాస నియోజకవర్గంలో జరిగిన హత్యలపై సమాధానం చెప్పగలరా? గరుడభద్ర పురంలో మీనాక్షి ఎలా చనిపోయింది? బాతుపురంలో సింధు మృతదేహం హైవే ట్రాక్‌పై పడేసిందెవరు? దీని వెనుక ఏం జరిగింది? సువ్వారపేటకు చెందిన నరేష్ విషయంలో రూ.50 లక్షలు తీసుకున్నది ఎవరు? వీటన్నిటి విషయంలో సెటిల్‌మెంట్ చేసిన ఘనత మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుదే' అని ఎమ్మెల్యే శిరీష ఆరోపించారు.

చోరీ కేసులో యువతి అరెస్టు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: చోరీ కేసుల్లో నిందితురాలైన ఓ యువతిని అరెస్టు చేశామని శ్రీకాకుళం గ్రామీణ పోలీసు స్టేషన్ ఎస్సై కె.రాము బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసన్నపేట మండలం కొత్తవలసకు చెందిన మామిడి గౌతమి శ్రీకాకుళం నగరం, గ్రామీణ ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడిందని చెప్పారు. ఆమె నుంచి కొంత సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమగ్ర దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు.

జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి 25 వరకు గడువు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: హెల్త్ కేర్ రంగానికి సంబంధించిన జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ఈ నెల 25 వరకు అవకాశం కల్పించామని బొల్లినేని మెడిస్కిల్స్ కార్యనిర్వాహక సంచాలకుడు సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన తరువాత కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు..!

- మెరుగైన ఫలితాలు సాధించే దిశగా చర్యలు
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

ఇంటర్ ఫలితాల్లో ఏటా కార్పొరేట్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటుంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, వారు అంతర్గత పరీక్షల్లో సాధించిన మార్కుల వివరాలు వాటిలో నమోదు చేయనున్నారు. తల్లిదండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ టెస్టులు, త్రైమాసిక, అర్ధ సంవత్సర, ప్రీ ఫైనల్ పరీక్షలు రెండు సార్లు నిర్వహిస్తారు. వీటి ఫలితాలు కార్డుల్లో నమోదు చేయడంతో వెనుకబడిన విద్యార్థుల వివరాలు అధ్యాపకులు, తల్లిదండ్రులకు ముందుగానే తెలుస్తాయి. వారిని బాగా చదివించేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేయడంతో ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది.


వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే వారికి లేత పసుపు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లేత నీలం రంగుల్లో కార్డులు ముద్రిస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయనుండటంతో పిల్లలు సక్రమంగా కళాశాలకు వెళ్తున్నారా అనే విషయం తల్లిదండ్రులకు తెలుస్తుంది.

న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం ఎచ్చెర్ల

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి అధిక ఉత్తీర్ణత సాధించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డు విధానం అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇటీవల జారీ చేసింది. నూతన విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, ప్రగతి తల్లిదండ్రులకు తెలుస్తుంది. తద్వారా ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించవచ్చని బోర్డు అధికారులు చెబుతున్నారు.



- జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38
- ఆదర్శ 12
- కస్తూర్బా గాంధీ విద్యాలయాలు 25
- ప్రైవేటువి 90



నమూనాల అందజేత

ప్రోగ్రెస్ కార్డుల నమూనాలను ఇంటర్ బోర్డు అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపారు. అమలు చేయాల్సిన తీరుపై ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డులు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వెనుకబడిన విద్యార్థులకు మేలు.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడంతో తల్లిదండ్రులు, అధ్యాపకులకు వారి ప్రగతి తెలుస్తుంది. ఇప్పటికే కళాశాలలకు కార్డుల నమూనాలు అందజేశాం. త్వరలోనే అన్ని కళాశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శివ్వాల తవిటినాయుడు, డీవైఈవో, శ్రీకాకుళం

భారీ లావాదేవీలపై ఆదాయ పన్ను శాఖ దృష్టి


మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ శ్రీనివాస్

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: భారీ లావాదేవీలపై తమ దృష్టి ఉంటుందని ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ బి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. కొంచెం ఆలస్యమైనా తప్పిదాలు రుజువు అవుతాయని.. తప్పిదానికి పాల్పడిన తేదీ నుంచి వడ్డీతో సహా భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం టాక్స్ బార్, బంగారు వర్తకుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 'మదింపు పన్ను విషయంలో వాస్తవమైన రిటర్న్‌లు మాత్రమే దాఖలు చేయాలి. రిఫండ్ క్లెయిం చేసే విషయంలో శాఖను తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడకూడదు. ఆలస్యంగానైనా అవి బయటపడతాయి. అప్పుడు ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుంది. కొత్త పన్ను చెల్లింపుదారుల సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. బంగారు వర్తకుల లావాదేవీల్లో ఎక్కువగా అక్రమాలు బయటపడుతున్నాయి. అనవసరంగా ఇబ్బందులు పడొద్దు' అని వివరించారు. అదనపు కమిషనర్ ఎన్.గోపీకృష్ణ, ఉప కమిషనర్ వై.విష్ణువర్ధన్‌రెడ్డి, సహాయ కమిషనర్ పి.వి.శేషగిరిరావు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న లిటిగేషన్లు పరిష్కరించుకోవడానికి విశ్వాస్-24 అనే పథకం ద్వారా జరిమానా, ప్రాసిక్యూషన్ లేకుండా బయటపడేందుకు అవకాశం ఉందని తెలిపారు. టాక్స్ బార్ సంఘం అధ్యక్షుడు యూవీ రమణ, బంగారు వర్తకుల సంఘం అధ్యక్షుడు పేర్ల సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని వ్యాపారులు నిజాయతీగా పన్నులు చెల్లిస్తారని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విశాఖ ఆదాయ పన్ను శాఖ అధికారులు కె.రవిశంకర్, అనిరుధ్ బి ఆత్రేయ, సీనియర్ ఛార్టర్డ్ అకౌంటెంట్లు వీఎం రావు, బి.శ్రీరామమూర్తి, ఐకే రావు, ఎల్.వాసుదేవరావు, శ్రీకాకుళం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా శాంతికుమారి


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా పి.శాంతికుమారి (హెడ్ నర్సు, ప్రభుత్వ సర్వజనాసుపత్రి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో మూడేళ్ల కాలానికి అన్ని పదవులకు ఒక్క సెట్ నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ప్రాంతీయ సహకార కార్యాలయం సహాయ రిజిస్ట్రార్లు కె.దామోదరరావు, పి.జానకిరామ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా ఎస్.చిన్నమ్మి (హెడ్ నర్సు, సీహెచ్‌సీ, బుడితి) కార్యదర్శిగా ఎల్.త్రినాథమ్మ (స్టాఫ్ నర్సు, ప్రాంతీయ ఆసుపత్రి, నరసన్నపేట) కోశాధికారిగా పి.సత్యవతి (హెడ్ నర్సు జీజీహెచ్, శ్రీకాకుళం), కార్యనిర్వాహక సభ్యులుగా టి.బేబీ (హెడ్ నర్సు, జీజీహెచ్), ఐ.కుసుమకుమారి (స్టాఫ్ నర్సు పీహెచ్‌సీ, చాపర) టి.చంద్రకళ (స్టాఫ్ నర్సు, సీహెచ్‌సీ, కోటబొమ్మాళి), పి.జగదాంబ (హెడ్ నర్సు, ప్రాంతీయ ఆసుపత్రి, సీతంపేట), హెచ్.నిర్మల (స్టాఫ్ నర్సు, టెక్కలి) ఎన్నికయ్యారు. వారితో ఎన్నికల అధికారి జానకిరామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి చర్యలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద వాహనాలను పరిశీలించి గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. 'ప్రధాన తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి. రైలు నిలయాలు, బస్ స్టేషన్లు, ముఖ్య కూడళ్లలో పోలీసు జాగిలాలతో సోదాలు నిర్వహించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అపరిష్కృత సైబర్ నేరాల కేసులను దర్యాప్తు చేయాలి. సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగహన కార్యక్రమాలు నిర్వహించాలి' అని ఎస్పీ ఆదేశించారు.

నిను విడిచి నేనుండలేను..!

- రెండు రోజుల వ్యవధిలో దంపతుల మృతి
- సత్రాంలో విషాదం


ధర్మారావు, తవిటమ్మ (పాత చిత్రాలు)

సారవకోట, న్యూస్‌టుడే: వివాహ బంధంతో ఒక్కటైన ఆ జంట దశాబ్దాలుగా అన్యోన్యంగా జీవించారు. ఒకరిని విడిచి మరొకరు ఉండలేమన్నట్లుగా చివరికి మరణంలోనూ తోడుగా తనువు చాలించారు. భర్త అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలిసిన భార్య రెండు రోజుల వ్యవధిలో ప్రాణాలు విడిచింది. ఈ హృదయ విదారక ఘటన సారవకోట మండలంలోని సత్రాం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వ్యవసాయంతో పాటు, గొర్రెలు, మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న గుండ ధర్మారావు (70) ఈనెల 20న అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందారు. అప్పటికే నరసన్నపేటలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య తవిటమ్మ (65) డిశ్చార్జి అనంతరం ఇంటికి వచ్చి భర్త మరణంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 22న మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వారికి ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు సత్యంకు వివాహమైన కొన్ని సంవత్సరాలకే మృతిచెందడంతో కోడలు, వారి పిల్లలను ధర్మారావు, తవిటమ్మలే పోషిస్తున్నారు.

సత్రాం డీలరు తొలగింపు

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామ డీలరు తంగి ఈశ్వరమ్మను బాధ్యతల నుంచి తప్పిస్తూ టెక్కలి ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దారు విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈశ్వరమ్మ సత్రాం సర్పంచిగా, డీలరుగా కొనసాగుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఆర్డీవో దస్త్రాలు పరిశీలించారని, వాస్తవాలు గుర్తించి విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. డీలరు బాధ్యతలను స్థానిక స్వయంశక్తి సంఘానికి అప్పగించామన్నారు.

బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డా. ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు ఈ ఏడాది అగస్టు 24వ తేదీ నుంచి జరిగాయి. ఈ సెమిస్టర్‌కు మొత్తం 1,044 మంది హాజరుకాగా వీరిలో 1,009 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.65 శాతం ఫలితాలు నమోదయ్యాయి. ఫలితాల వివరాలు వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

బీఆర్ఏయూలో న్యాయవిద్య కోర్సుకు బీసీఐ అనుమతి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్య కోర్సుకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అనుమతి మంజూరు చేసినట్లు న్యాయశాస్త్రం విభాగాధిపతి డా. వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీకి బీసీఐ అనుమతులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను న్యాయశాస్త్ర అధ్యాపకులంతా బుధవారం వీసీని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెన్యూవల్ రుసుం, గ్యారెంటీ ఫీజు సకాలంలో చెల్లించడంతో పాటు కోర్సుకు సంబంధించిన వార్షిక ధ్రువపత్రాలను బీసీఐ అధికారులు పరిశీలించి సంతృప్తి చెంది ప్రవేశాలకు అనుమతులు మంజూరు చేశారన్నారు. వీసీని కలిసిన వారిలో న్యాయశాస్త్ర అధ్యాపకులు బి.బాలకృష్ణ, కె.చిన్నంనాయుడు, జి.మన్మథరావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఎస్.ఒ.గా సామ్రాజ్యలక్ష్మి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రత్యేకాధికారి(ఎస్.ఒ.)గా డా. కె.సామ్రాజ్యలక్ష్మిని వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని బుధవారం నియమించారు. వర్సిటీలోని వీసీ ఛాంబర్‌లో బుధవారం ఆమె నియామకపత్రం అందుకున్నారు. వర్సిటీలోని పాలన, ఆర్థిక, పరీక్షల సంబంధిత అంశాలను ఈమె ఎస్.ఒ. హోదాలో పర్యవేక్షించనున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఈమె గతంలో ఏయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా, జాయింట్ రిజిస్ట్రార్‌గా, ఫైనాన్స్ అధికారిగా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, నూజివీడు ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు చేపట్టిన సామ్రాజ్యలక్ష్మిని వర్సిటీ రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ యు.కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపల్ ఎం.అనురాధ అభినందించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి


లక్ష్మణ్ (పాత చిత్రం)

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయమైంది.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వివాహానికి ముహూర్తం పెట్టి పనులు ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా ఉన్న యువకుడిని విద్యుదాఘాతం రూపంలో మృత్యువు బలిగొంది. ఈ ఘటన మండలంలోని గాజులకొల్లివలస జగనన్న కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నాంపేట కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కర్రి లక్ష్మణ్(24) గాజులకొల్లివలస వద్ద జగనన్న కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనులకు బుధవారం వెళ్లాడు. పనులకు నీరు అవసరం కావడంతో అక్కడ ఉన్న మోటారు వద్దకు వెళ్లి స్విచ్ ఆన్ చేసేందుకు బోర్డులో తీగలు పెట్టగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే అతనిని స్థానిక జొన్నవలస 30 పడకల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలియడంతో అతని తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, శిమ్మయ్య, ఇద్దరు అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అందరితో కలిసి మెలిసి ఉండే యువకుడి మృతితో తోటి భవన నిర్మాణ కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఘటనతో పొన్నాంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి సిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీరు దుర్మరణం


వెంకటకృష్ణ చాణక్య

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఇంటి నుంచి పని చేసుకుంటూ తల్లిదండ్రులతో గడపడానికి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీకి చెందిన సోమయాజుల వెంకట శ్రీనివాస్, ఈశ్వరి దంపతుల కుమారుడు వెంకటకృష్ణ చాణక్య (23) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. దసరా నేపథ్యంలో ఆయన ఇటీవల స్వస్థలానికి వచ్చి ఇంటి నుంచి పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం టీ తాగడానికి బయటకు వచ్చారు. స్నేహితుడి ద్విచక్ర వాహనంపై 80 అడుగుల రహదారిలో వెళ్తూ ముందు వెళ్తున్న కారు మలుపు తిరుగుతుండగా వెనుక భాగంలో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. 'అమ్మా స్నేహితులతో బయటకు వెళ్లి వస్తానని' చెప్పిన కొడుకు హఠాన్మరణం చెందాడని తెలిసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

రైలు ఢీకొని యువకుడి మృత్యువాత


శ్రీనివాసరావు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం తిలారు రైల్వేగేటు సమీపంలో రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రోడ్డు- పలాస రైలు పట్టాలపై తిలారు రైల్వేగేటు సమీపంలో రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గుర్తించారు. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతి చెందిన వ్యక్తి పోలాకి మండలం ఈదులవలస గ్రామానికి కొర్ను శ్రీనివాసరావుగా (27) తెలుసుకున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించామని.. శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని జీఆర్పీ ఎస్సై ఎం.మధుసూదనరావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరు ఆకతాయిలకు జైలు శిక్ష

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో రహదారిపై మంగళవారం రాత్రి బహిరంగంగా మద్యం తాగి వికృత చేష్టలకు పాల్పడుతున్న ఇద్దరు ఆకతాయిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దమ్మల వీధికి చెందిన వి.ఢిల్లీశ్వరరావు, బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన బి.త్రినాథరావులపై ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేశారు. సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య: పలాస మండలం గంగువాడ ఎస్సీ వీధి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతతో ఇబ్బంది పడుతున్నాం - **స్థానికులు**

సమాధానం: త్వరలోనే సమస్యను పరిష్క రిస్తాం - **విక్రమ్, ఏఈఈ, ఆర్ అండ్ బీ**

సమస్య : ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా లాలా పేట రహదారి మార్గంలో కాలువ మూసుకుపోయి నీరు పారడం లేదు - **బి.కేశవరావు, ఇచ్ఛాపురం**

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం. కాలువపై ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం

- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం

పేద కుటుంబానికి చేయూత



వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల అప్పలస్వామి గతంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భార్య ధనలక్ష్మి తన ఇద్దరి కుమార్తెలను పెంచుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన గరక ఆదినారాయణ, తిమ్మల గణపతి, దుమ్ము కోదండరావు, గర్లం మోహన్, తదితరులు స్పందించారు. వారితో పాటు దాతలు, గ్రామస్థుల సహాయాన్ని కోరారు. రూ.1.65 లక్షల నగదును విరాళాల ద్వారా సేకరించి బాధిత కుటుంబానికి బుధవారం అందించారు. **- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం**



ప్రతిభ చూపారు



పలాస కాశీబుగ్గ పురపాలక పరిధి చిన్నబడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇందులో సి.హెచ్.వర్షిణి (10వ తరగతి), ఎం.యామినిదుర్గ (10వ తరగతి), పి.సాహితి (9వ తరగతి) వరుస మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్.ఉషారాణి, ఉపాధ్యాయులు డి.కృష్ణమూర్తి, డి.శ్రీనివాసరావు, పి.లక్ష్మీపతి, బి.షన్ముఖరావు, కె.గోవిందరాజులు, ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస


అరాచకాలు కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో చేసిన అరాచకాలు, హత్యాచారాలను కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీషపై విమర్శలు చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు అరసవెల్లి ఉమామహేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు ఎద్దేవా చేశారు. మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరు తెదేపా కార్యాలయంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతుంటే వైకాపా నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

తుపాను వస్తే.. తలదాచుకునేదెలా?

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, మందస(హరిపురం)

తీర ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాల్సినా తుపాను రక్షిత భవనాలు అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఇచ్ఛాపురం మండలం డొంకూరులో నిర్మించిన పునరావాస కేంద్రాన్ని వైకాపా సర్కారు పట్టించుకోకపోవడంతో వృథాగా ఉంది. అరకొర పనులు, మౌలిక వసతులు మినహా దాదాపు భవనం పూర్తయినా గుత్తేదారుడికి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. మందస మండలం టి.గంగువాడలో తుపాను భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానికులకు అవస్థలు తప్పడంలేదు.



టి.గంగువాడలో తుపాను రక్షిత భవన దుస్థితి

ఇచ్ఛాపురం మండలంలో సముద్రతీర ప్రాంత గ్రామాలైన డొంకూరు, పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాల ప్రజలు తుపాను వస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటు గడపాల్సిన పరిస్థితి నెలకుంది. డొంకూరు కేంద్రంగా ఐదేళ్ల కిందట నిర్మించిన తుపాను రక్షిత భవనాలకు 2018లో రూ.2కోట్లు మంజురయ్యాయి. ఏడాది పాటు సక్రమంగా పనులు సాగాయి. భవనం రెండస్తులకు శ్లాబులు వేసి గొడలు నిర్మించి గదులలో ప్లాంటింగ్ పనులు పూర్తి చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి నిర్మాణంపై శ్రద్ధ చూపలేదు. భవనం సగంలోనే ఆగిపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. పనులు పూర్తి చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తీర ప్రాంత వాసులకు తప్పని కష్టాలు



డొంకూరులో అసంపూర్తిగా నిచిలిన తుపాను రక్షిత భవనం

పాఠశాల భవనాలే దిక్కు

తుపాను రక్షిత భవనంలో తాగునీరు, విద్యుత్తు, మౌలిక వసతులు లేవు. తుపానుల సమయంలో డొంకూరు గ్రామంతో పాటు పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాల ప్రజలను ఈదుపురం ఉన్నత పాఠశాలకు తరలించి రక్షణ కల్పిస్తుంటారు. అయితే సురక్షిత ప్రాంతాల పేరుతో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదుపురం ఉన్నత పాఠశాలకు తరలిస్తుండటంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతుంటారు. వారి స్వగ్రామాల్లో రక్షిత భవనాలను నిర్మించాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరడంతో..

మందస మండలంలోని తీర గ్రామం తెలగంగువాడలోని తుపాను భవనం శిథిలావస్థకు చేరి వినియోగానికి దూరంగా ఉంది. గోడలకు పగుళ్లు ఏర్పడి విషసర్పాలకు ఆవాసంగా మారింది. పైకప్పుల నుంచి పెచ్చులూడి పడుతుండంతో విపత్తుల సమయంలో అధికారులు పునరావాస కేంద్రంగా సుమారు పది కిలోమీటర్ల దూరంలోని హరిపురం ఉన్నత పాఠశాలకు జనాన్ని తరలిస్తున్నారు. వినియోగపడని శిథిల భవనాన్ని తొలగించాలని గ్రామస్థులు అభ్యర్థిస్తున్నారు. పంచాయతీ తీర్మానం ఇస్తే తొలగించే చర్యలు చేపడతామని ఆర్ అండ్‌బీ జేఈ విక్రం పేర్కొన్నారు.

అంచనాలు పంపించాం..

డొంకూరు రక్షిత భవన నిర్మాణానికి సంబంధించి రెండో విడత ప్రభుత్వానికి అంచనాలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- ధనుంజయరావు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇచ్ఛాపురం**

రోడ్డుపై కోత.. ప్రయాణానికి అవస్థ



ఇచ్ఛాపురం పురపాలకసంఘ పరిధి బంగ్లారోడ్డు-లాలాపేట కూడలిలో రహదారి మధ్యగా ఉన్న కల్వర్టు కారణంగా రోడ్డు మధ్యలో చీలిక ఏర్పడి, వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. లాలాపేట, రైలునిలయం, పురపాలకసంఘ కార్యాలయం, బాలికల జూనియర్ కళాశాల, బంగ్లాలకు వెళ్లేవారు ఈ కోత రోడ్డును దాటాల్సి ఉంటోంది. ముఖ్యంగా విద్యార్థుల రాకపోకల సమయంలో ప్రమాదానికి గురవుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు రమేష్ తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

విలువైనది.. వినియోగమేదీ?



మందస మండల సిరిపురం పీహెచ్‌సీకి సంబంధించిన థెరపీ యూనిట్ యంత్రం ఇది. గత కొంత కాలంగా దీన్ని ఆరు బయట వృథాగా వదిలేయడంతో ఎండావానకు పాడయ్యే అవకాశాలు ఉన్నాయని ఆసుపత్రికి చెందిన సిబ్బంది వాపోతున్నారు. ఆసుపత్రి లోపల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందువల్ల బయట ఉంచాల్సి వచ్చింది. పనులు పూర్తవ్వగానే లోపల పెడతామని వైద్యాధికారి సాయి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

చెత్త తొలగించారు

స్పందనకు వందనం

పురపాలక సంఘంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. 'చెత్త సేకరించరు... పూడిక తొలగించరు' పేరిట బుధవారం ఈనాడులో వచ్చిన కథనంపై పారిశుద్ధ్య విభాగ అధికారులు స్పందించారు. పేరుకుపోయిన చెత్తను పొక్లెయినర్ సహాయంతో ట్రాక్టర్లలోకి ఎక్కించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. చెత్త నిల్వలేకుండా రోజూ తరలించేలా చూడాలని స్థానికులు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, పలాస



నిర్లక్ష్యం ఇలా వాలింది...

కవిటి మండలం పెద్ద కరివానిపాలెం, చిన్నకరివానిపాలెం వద్ద గొనమారి గెడ్డ అంచున విద్యుత్తు స్తంభం ఏ క్షణంలోనైన పడిపోయే స్థితిలో ఉంది. దీనిపై 11 కేవీ వైర్లు ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఆ గెడ్డలో పశువులు ఈదుతుంటాయని, ఏక్షణమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసరావుని వివరణ కోరగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



రాత్రివేళ.. కుక్కల బాధ



ఇచ్ఛాపురం పట్టణంలో రాత్రివేళ ప్రయాణికులు, ఆసుపత్రులకు వెళ్లేవారు కుక్కల స్వైరవిహారం చూసి భయాందోళనలకు గురవుతున్నారు. ప్రాంతాల వారీగా బృందాలుగా ఏర్పడిన గ్రామసింహాల గుంపు రోడ్లపై స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని కూడా వదలడం లేదు. ఇక నడిచి వెళ్లేవారు చేతిలో కర్రనో, రాయినో పట్టుకుని ముందుకు సాగాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాకు తుపాను ముప్పు పొంచే ప్రమాదం ఉన్నందున అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి ఏపీడీ చల్ల శ్రీనివాసు రెడ్డి అధికారులకు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రధానంగా మత్స్యకార తీర ప్రాంతాలలో మౌలిక సదుపాయాలతో పాటు వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో కె.రామారావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ★ పొంచి ఉన్న తుపాను ప్రభావంతో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలియజేశారు. డొంకూరు తీర ప్రాంతాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం తుపాను రక్షిత భవనాన్ని పరిశీలించారు. తాగునీరు, విద్యుత్తు మౌలిక వసతులు కల్పించాలని అక్కడి సిబ్బందిని సూచించారు.

ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సాహు సంధ్య



సాహు సంధ్యను జ్ఞాపికతో సత్కరిస్తున్న సభ్యులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : మాణిక్యపురం గ్రామానికి చెందిన యువ కవియిత్రి, రచయిత్రి సాహు సంధ్య ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. ఈ నెల 19, 20వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని జరిగిన అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదికపై ప్రపంప తెలుగు సాహిత్య, కళాజాతలో 24 గంటల, 24 నిమిషాల, 24 సెకన్లు పాటు నిర్విరామంగా నిర్వహించిన పోటీల్లో ఆమె పాల్గొన్నారు. దీంతో ఆమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్ట్స్, భారత్ టాలెంటు రికార్డ్స్, ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అండ్ కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సాహు సంధ్య పేరు నమోదు చేస్తున్నట్లుగా కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని అందించారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



పెసరపాడులో రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, హరిపురం (మందస), న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని పెసరపాడులో రూ.10 లక్షలతో నిర్మాణం చేసే రహదారి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కమిషనర్ ఎన్.రామారావు, డీఈఈ కనకరాజు, ఏఈ కిరణ్, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబురావు, తెదేపా నాయకులు బి.నాగరాజు, ఎల్.కామేశ్వరరావు, జి.కృష్ణారావు, ఏ.కృష్ణమూర్తి, జి.నిరంజన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు. మందస మండలం హరిపురం, బైరిసారంగపురం, జిల్లుండ, కృష్ణాపురం, తాళ్లగురంటిలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

కొబ్బరి, జీడిమామిడి సస్యరక్షణకు చర్యలు



సోంపేట: అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

సోంపేట, ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: కొబ్బరి, జీడిమామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు అధికారులు సూచించారు. సోంపేట మండలం ఉప్పలాం, సిరిమామిడి పంచాయతీల్లో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో బుధవారంనిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వివిధ పంటల పరంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.★ చీడ పీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ జగన్మోహన్ పేర్కొన్నారు. మండలం పరిధి తేలుకుంచి, డొంకూరు గ్రామాల్లో ఏవో బి.భార్గవి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ★ పలాస మండలం బొడ్డపాడులో ఉద్యాన, వ్యవసాయ అధికారులు జీడి పంటలో చిగురు, పూత, పందె దశల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్య రక్షణ చర్యలపై రైతులతో చర్చించారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



చిన్న కొజ్జిరియా సదస్సులో నాయకులు, అధికారులు

కంచిలి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే : కంచిలి మండల పరిధి పెద్దకొజ్జిరియా, చిన్న కొజ్జిరియా గ్రామాలలో బుధవారం ఉదయం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ సర్వే కారణంగా ఏర్పడిన పలు భూ సంబంధిత సమస్యలపై పలువురు రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ★ గత ప్రభుత్వంలో రీ-సర్వేలో నెలకొన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎన్.వెంటకరావు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలం కేసుపురం గ్రామంలో గ్రామ సభలు నిర్వహించారు. ★ వైకాపా హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేసేందుకు పలాస మండలం పూర్ణభద్ర గ్రామంలో తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

ప్రమాద మృతుడు పశ్చిమ బెంగాల్ వాసి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం రైలు నిలయంలో మంగళవారం రాత్రి మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయని పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్‌కు చెందిన సంతు కర్మాకర్ (24)గా మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో గుర్తించామని పేర్కొన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, శవపంచనామా చేస్తున్నామని చెప్పారు. కాగా మృతుడు ఆత్మహత్యకు ముందు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై ఏడుస్తూ కూర్చోవడం కొందరు గమనించారు. అతడు ఆత్మహత్యకు పాల్పడతాడని ఊహించలేకపోయామని చెబుతున్నారు.

టీపీవోగా వరప్రసాదరావు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారిగా వరప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అప్పలరాజుకు విజయనగరం బదిలీ అవ్వగా, విశాఖ జి.వి.ఎం.సిలో పనిచేస్తున్న వరప్రసాదరావును పలాసకు బదిలీ చేయటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సేవలే గుర్తింపునిస్తాయి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయని సర్పంచ్ పూడి వరప్రసాద్, వైస్ ఎంపీపీ నేతాజీలు అన్నారు. జగతి సచివాలయంలో కార్యదర్శిగా పని చేసి ఇటీవలే బదిలీపై వెళ్లిన విజయ కుమార్‌ను గ్రామస్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. బి.నారాయణమ్మ, పి.రాజ్యలక్ష్మి, పూడి హరినారాయణ, బి.రాజేష్, బి.భాస్కర్, బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు తొలగింపు

పలాస, న్యూస్‌టుడే: పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం ఒకటో వార్డు మొగిలిపాడు దత్తాత్రేయ ఆలయ రహదారిలో పనికిరాని మొక్కలు తొలగించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రహదారి ఇరువైపులా ఉండే మొక్కలను పొక్లెయినర్‌తో తొలగించే పనులు చేపట్టారు. నాయకులు ఎస్.జగన్నాయకులు, వి.ఎన్.శర్మ, రాజు, సాయి, సంతోష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ


కఠినంగా శిక్షించాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రతినిధులు భాగ్యలక్ష్మి, ఢిల్లేశ్వరిలు పేర్కొన్నారు. కాశీబుగ్గలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

తల్లిదండ్రుల సమావేశాలు ముఖ్యం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పాఠశాల నిర్వహణలో నియమనిబంధనలు పాటించాలని, ముఖ్యంగా పాఠశాల స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం అవసరమని రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ విజయ రామరాజు అన్నారు. ఆయన ఎస్‌పీడీ గిరి శ్రీనివాస్‌తో కలిసి దూరదృశ్య శ్రవణమాధ్యమం (స్టేట్ వెబ్స్) ద్వారా ఇచ్ఛాపురం ఎంఈవో, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎంఈవో కురమాన అప్పారావు, పట్టణం, మండల పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొని, కమిషనర్ ఆదేశాలను నమోదు చేసుకున్నారు. బడిబయట పిల్లలను గుర్తించి, వారిని నేరుగా బడిలో చేర్పించాలని ఆదేశించారు.

సమస్య చెబితే పరిష్కారం చూపిస్తాం



పురపాలక సంఘంలో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ సమస్యలు విన్నవిస్తే పరిష్కారం జరిగేలా చూస్తామని కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పురపాలక సమావేశ మందిరంలో బుధవారం గృహనిర్మాణాలపై ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇళ్లు పూర్తి చేసుకోవాలని లేదంటే రద్దవుతాయని తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

బొడ్డపాడు సమస్యలు బోలెడు

పట్టించుకోని పాలకులు



గోతులమయంగా బొడ్డపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

శ్రీకాకుళం జిల్లాలో ఒకప్పటి ఉద్యమాలకు ఊపిరి పోసిన గ్రామం బొడ్డపాడు. ఎంతోమంది విప్లవకారులను, జానపద కళాకారులను పరిచయం చేసిన ఊరు. ప్రజల కష్టాలు తీర్చేందుకు పోరాడుతున్నవారు, ప్రజా సంఘాల నాయకులు, సామాజికంగా ఎక్కువ మంది చైతన్యవంతులు ఉన్న పల్లెటూరు. జిల్లాలో పరిచయం అక్కర్లేని ఈ గ్రామం ప్రస్తుతం పలు సమస్యలను ఎదుర్కొంటోంది.

పలాస మండలం బొడ్డపాడు పంచాయతీలో బొడ్డపాడు, మామిడిపల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలనూ ఏళ్లగా వివిధ సమస్యలు వేధిస్తున్నాయి. గ్రామానికి శుద్ధజల ప్లాంటు లేక ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుక్కొని తాగాల్సిన దుస్థితి నెలకుందని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ పైపులు వేసి తాగు నీరు అందిస్తామని చేతులు దులుపేసుకున్నారు. మామిడిపల్లి గ్రామంలో ఉన్న నీటి ట్యాంకు మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తగా మెట్లు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



గొల్ల వీధి, ఎస్సీ వీధి మధ్యలోని కాలువ దుస్థితి

నాటుసారా పెరిగిపోతోంది

ఉద్దానంలో నాటు సారా విస్తరిస్తోంది. బొడ్డపాడు, మామిడిపల్లి, మాకన్నపల్లి పరిసరాల్లోని తోటల్లో నాటుసారా, కల్తీసారా ఎక్కువగా విక్రయిస్తున్నారు. దాని వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గ్రామంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు పెట్టాలి. యువత, నిరుద్యోగుల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

–పోతనపల్లి కుసుమ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బొడ్డపాడు

సీసీ రహదారులు లేవు..

బొడ్డపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు రైతులు, గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రోడ్డు విషయమై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లినా ఉపయోగం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని పేర్కొంటున్నారు. గొల్ల వీధి, ఎస్సీ వీధి మధ్యలోని కాలువ శుభ్రం చేసి సుమారు నాలుగైదు నెలలు అవుతోందని, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

పరిష్కారానికి చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఏఏ సమస్యలు ఉన్నాయో వాటన్నింటినీ ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరిస్తాం. – కొర్లగ్గి వసంతకుమార్ ఎంపీడీవో, పలాస

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం నౌగాం గ్రామంలో శివాలయం వద్ద మురుగు పేరుకుపోయింది. దుర్గంధం, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **- కొంచాడ జనార్దనరావు, స్థానికుడు**

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టి, సమస్యను పరిష్కరిస్తాం. **- జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి, నౌగాం**

– న్యూస్‌టుడే, నందిగాం

వేధింపులు నిరోధించాలి



నరసన్నపేట, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, వెంటనే వాటిని నిరోధించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సహాయ కన్వీనర్ ఎ.మహాలక్ష్మి అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలో బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇటీవల పలాస మండలంలో జరిగిన ఘటనపై సత్వరం దర్యాప్తు నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఎ.రాధ, కాంతమ్మ, లక్ష్మి, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

ఓటమే విజయానికి పునాది





ఓటమే విజయానికి పునాది అని టెక్కలి మండలం సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రోణంకి గౌరీ ప్రసాద్ అన్నారు. బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టి.రక్షిత (పదో తరగతి), ఎస్.భరత్ (తొమ్మిదో తరగతి), కె.రేష్మ (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో నిలుద్దాం



జలుమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, సారవకోట, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో నిలుద్దామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు మండలం చల్లవానిపేటలో పార్టీ సమావేశం బుధవారం జరిగింది. ఈనెల 26 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని కార్యకర్తలంతా ఉత్సాహంగా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, జిల్లా మహిళాకార్యదర్శి గురువెల్లి ఝాన్సీరాణి పాల్గొన్నారు. ★ తెదేపా శ్రేణులు పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. సారవకోట మండలం సవరడ్డపనసలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి తేజ్‌కుమార్, ఎంపీపీ కూర్మినాయుడు, మండల అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచండి

హిరమండలం, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా వృత్తి విద్యా అధికారి ఎస్.తవిటినాయుడు అన్నారు. బుధవారం హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. గత కొన్నేళ్ల నుంచి ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని, ప్రిన్స్‌పల్, అధ్యాపకులు పెంచేందుకు కృషి చేయాలన్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ పీఈఎస్ పట్నాయక్ పాల్గొన్నారు.

సలహాలు ఇస్తూ.. సమస్యలు తీరుస్తూ

న్యూస్‌టుడే, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం

గ్రామాల్లో సందడిగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

వైకాపా పాలనలో కీలకమైన వ్యవసాయ శాఖ కార్యక్రమాలు గాడి తప్పాయి. అన్నదాతలకు సాగులో మెలకువలు తెలిపేందుకు నిర్వహించాల్సిన అవగాహన సదస్సులు మొక్కుబడి తంతుగా మార్చేశారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని చక్కదిద్దే చర్యలు చేపట్టింది. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను రైతుల చెంతకు పంపి వారికి సాగులో సూచనలు, సలహాలు అందిస్తే మేలు జరుగుతుందని ప్రస్తుత పాలకులు భావించారు. ఈ మేరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభించారు. అందులో భాగంగా అధికారులు సాగు విషయాలపై అవగాహన కల్పించడమే కాకుండా పరిశీలించి లోటుపాట్లు తెలియజేస్తున్నారు.



కిట్టాలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాతపట్నం నియోజకవర్గం వివరాలు	
మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
ఎల్ఎన్‌పేట	10,817
మెళియాపుట్టి	15,213
పాతపట్నం	15,340
కొత్తూరు	17,512
హిరమండలం	7,187

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఈ ఖరీఫ్‌లో పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. సెప్టెంబర్ 24 నుంచి వారానికి రెండు రోజుల చొప్పున 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. చీడపీడల నివారణ, విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు ఇచ్చి వారిని చైతన్యం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



సాగులో అవసరమైన విషయాలు అధికారులు తెలియజేస్తున్నారు. రైతుల వద్దకు వచ్చి సలహాలు, సూచనలివ్వడం ఆనందంగా ఉంది. ఎరువులు ఎంత మోతాదులో వాడాలో చెబుతున్నారు.

- చెట్టు శ్రీనివాసరావు, అంబావల్లి

అన్నింటిపై పరిజ్ఞానం ఉండదు



సాగు పరమైన అన్ని విషయాలపై రైతులకు పరిజ్ఞానం ఉండదు. పొలంలో పరిస్థితులు గమనించి సలహాలు ఇస్తున్నారు.

- ఢిల్లేశ్వరరావు, ధనుపురం

ఎంతో ఉపయోగం

ఈ కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వారు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. అన్నదాతలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- బి రాజగోపాల్, ఏడీఏ, కొత్తూరు డివిజన్

సారూ.. బాగు చేయరూ..



పోలాకి మండలం గొల్లలవలస గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న బోరు రెండు వారాలుగా పని చేయడం లేదు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని కేంద్రం కార్యకర్త గొద్దు లక్ష్మి పేర్కొన్నారు. దీంతో కేంద్రానికి వచ్చే లబ్ధిదారులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై జేఈ రాజేశ్వరి మాట్లాడుతూ సర్పంచి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పోలాకి

లక్ష్యం వేరు.. నిర్లక్ష్యం తీరు

ఉపాధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు 17 విడతల్లో సారవకోట మండలంలో సామాజిక తనిఖీలు జరిగాయి. ప్రతిసారి పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయలేదని, కొలతల్లో తేడాలు వస్తున్నాయని అధికారులు తెలియజేస్తూనే ఉన్నారు. అయినా సిబ్బందిలో మార్పు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మాళువ పంచాయతీలో బుధవారం గ్రామ సభ జరిగినప్పటికీ, పనులకు సంబంధించిన సమాచార బోర్డులు స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద మూలుగుతున్నాయి. చర్యలు తీసుకుంటామని ఏపీవో నారాయణరావు చెప్పారు. – న్యూస్‌టుడే, సారవకోట



ప్రభుత్వాసుపత్రి.. ఇదీ పరిస్థితి



ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో వచ్చే రోగులకు పడకలు పరుపులు వాటిపై దుప్పట్లు శుభ్రంగా ఉంచాలి. ప్రతి రోజు దుప్పట్లు మార్చాలి. వాటిపై ఏరోజుకు ఆరోజు పేరు కూడా ఉంటుంది. కానీ ఇవేవీ మెళియాపుట్టి ఆసుపత్రిలో కానరావడం లేదు. బుధవారం 11 గంటల సమయంలో 'న్యూస్‌టుడే' ప్రతినిధి సందర్శించిన సమయంలో పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు. ఈ విషయమై వైద్యులు గ్రీష్మాను వివరణ కోరగా రోగులు దుప్పట్లను ఉంచడం లేదని వాటిని తొలగిస్తున్నారని పేర్కొనడం గమనార్హం.

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

అభివృద్ధి వైపు అడుగులు

టెక్కలి పట్టణంలోని భవానీనగర్, అయ్యప్పనగర్ రహదారి పనులను యంత్రాంగం ప్రారంభించింది. పాత, కొత్త జాతీయ రహదారులను కలుపుతూ ఆ ప్రాంతంలో 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి ఇటీవల మంత్రి అచ్చెన్న రూ.1.8 కోట్లతో శంకుస్థాపన చేశారు. బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో నిర్మాణాలు తొలగించారు. ఓ రైసు మిల్లుకు చెందిన గోడ తొలగిస్తున్న సమయంలో యజమాని అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులను నిలుపుదల చేయక పోవడంతో అసహనంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



వారికి పట్టదు.. వీరికి తప్పదు



నందిగాం మండలం పెంటూరు నుంచి వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడ వరకు ఉన్న బీటీ రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. పెంటూరు సమీపంలో మర్రి చెట్టు మలుపు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే మార్గం కావడంతో ప్రమాదాలు జరగకుండా స్థానికులు ఓ కర్రకు సూచికగా గుడ్డ కట్టారు. ఇప్పటికైనా స్పందించాలని ఆయా ప్రాంతాలకు చెందిన వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే మరమ్మతులు చేపడతామని పీఐయూ ఏఈ మోహన్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

పోర్టు నిర్వాసితుల తరఫున ఉద్యమిస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి న్యాయం జరగకుంటే బాధితుల తరఫున పోరాటానికి దిగుతానని వైకాపా నేత, శాసనమండలి సభ్యుడు దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. అక్కవరం సమీపంలోని ఆయన నివాసగృహం వద్ద బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శరవేగంగా జరుగుతున్న పనులను ప్రభుత్వం మారాక ఐదు నెలలు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. కమీషన్ల కోసం ఆశపడే పనులు అడ్డుకున్నారని ఆరోపించారు. వైకాపా హయాంలో ఉపాధి పొందుతున్న చాలామందిని రాజకీయ కక్షతో తొలగించారని ఆరోపించారు.

హైదరాబాద్‌లో వలస కార్మికుడి మృతి



గణపతిరావు (పాతచిత్రం)

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: లింగాలవలస పంచాయతీ సొర్లిగాం గ్రామానికి చెందిన వలస కార్మికుడు కూన గణపతిరావు(39) గుండెపోటుతో తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మృతి చెందాడు. హైదరాబాద్‌లో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న ఇతడు అస్వస్థతకు గురవడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గణపతిరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

తుపాను నేపథ్యంలో రైళ్లు రద్దు

పాతపట్నం, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో ఈ నెల 24, 25వ తేదీల్లో నౌపడ-గుణుపురం మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గుణుపురం- పూరీ, కటక్- గుణుపురం, గుణుపురం-విశాఖపట్నం, రాజ్యరాణి రైళ్లు రద్దయ్యాయని చెప్పారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

15 రోజుల్లో వినతులకు సమాధానం



సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు, చిత్రంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

హిరమండలం, న్యూస్‌టుడే: ప్రజలు అందజేసే వినతులకు 15 రోజుల్లో అధికారుల నుంచి సమాధానం రావాలని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 23 పంచాయతీల నుంచి 440 వినతి పత్రాలను ప్రజలు అందజేశారు. వీటిలో గరిష్ఠంగా పింఛన్ల మంజూరు దరఖాస్తులే ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, మండల పరిషత్తు ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న జూనియర్ సివిల్‌జడ్జి హరిప్రియ

నరసన్నపేట, న్యూస్‌టుడే: వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.హరిప్రియ సూచించారు. న్యాయవాదులు, అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జామి కామేశ్వరరావు, ప్రతినిధులు కొండలరావు, జగన్నాథం, రమణ పాల్గొన్నారు.

గణిత దీప్తి పుస్తకావిష్కరణ

కొత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన లక్ష్యం ఉండాలని కడుము జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుమలరావు అన్నారు. పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి గణిత ఉపాధ్యాయుల ఫోరం రూపొందించిన గణితదీప్తి అనే పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించి, విద్యార్థులకు అందించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అవీ.. ఇవీ.. అన్నీ

విద్యార్థి గౌడ వేదవ్యాస్ పాల్గొని జాతీయ రికార్డుల్లో భాగస్వామ్యం కావడం గర్వకారణమని స్థానిక ఓక్లాండ్ పాఠశాల ప్రిన్సిపల్ మధులత అన్నారు. విద్యార్థిని బుధవారం పాఠశాలలో సన్మానించి అభినందించారు.

ఫ్లెక్సీల చించివేతపై నిరసన

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మండలంలో జనసేన నాయకులకు చెందిన ఫ్లెక్సీలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంపై ఆ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మండల నాయకులు దుక్క బాలరాజు, ప్రసాదరావు, సవర రామ్మూర్తి, క్రాంతి, కిరణ్ నిరసన వ్యక్తం చేస్తూ.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏఎస్ఐ ఎర్రన్నాయుడు హాజరై అమరవీరుల గొప్పతనం, వారి పోరాటాలను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ బి.సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ సాహితీ కళా జాతరలో తమ పాఠశాలకు చెందిన

గిరిజనుల అభ్యున్నతికి కృషి

హిరమండలం, న్యూస్‌టుడే: గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందులో భాగంగా పీఎం జన్‌మన్ పథకం ద్వారా వసతి గృహం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. బుధవారం గొట్టలక్ష్మీపురం గ్రామం వద్ద వసతి గృహం భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంఈవో కె.రాంబాబు తహసీల్దారు హనుమంతరావు పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలు గుర్తింపు

సారవకోట, న్యూస్‌టుడే: మాళువ పంచాయతీ పరిధిలో మూడు చెరువుల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో కొలతల తేడాలు ఉన్నట్లు గుర్తించామని సామాజిక తనిఖీ డీఆర్పీ రాజు గ్రామసభలో బుధవారం వెల్లడించారు. వాంద్రాయిలో జరిగిన గ్రామసభలో 4 చెరువుల పనుల్లో పరిస్థితి ఇలాగే ఉందని డీఆర్పీ శ్రీను తెలిపారు. మాళువ గ్రామసభను ఎంపీడీవో మోహన్‌కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నారాయణరావు, ఎస్ఆర్పీ పున్నపునాయుడు పాల్గొన్నారు.



అప్రమత్తంగా ఉండాలి

హిరమండలం, కొత్తూరు, న్యూస్‌టుడే: తుపాను కారణంగా రైతులు వరి కోతలు నిలిపి వేయాలని వ్యవసాయ అధికారి బి.సంధ్య తెలిపారు. బుధవారం హిరమండలంలో ఆమె మాట్లాడుతూ తుపాను ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. ● వంశధార నదీ తీర గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు ఎంపీడీవో నీరజ, ఈవోపీఆర్డీ వసంతకుమారి అన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించారు.

స్పందించారు.. ఇక్కట్లు తీర్చారు..!

టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై యంత్రాంగం స్పందించింది. పారిశుద్ధ్య లోపం, రహదారులు అధ్వానంగా మారడం తదితర వాటిపై ఈనాడులో ఇటీవల ప్రచురితమైన వార్తలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కట్లు తీరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే బృందం

స్పందనకు వందనం

ఎట్టకేలకు మోక్షం



కొమ్ముసరియాపల్లి వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

సారవకోట, న్యూస్‌టుడే: హిరమండలం పరిధి సవితిసీది నుంచి సారవకోట మండలం బొంతుకూడలి మీదుగా పాతపట్నం మండలం తెంబూరు వరకు ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 15 కి.మీ. ఈ మార్గాన్ని రెండు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు వైకాపా హయాంలో రూ.25 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు కొంతమేర పనులు చేపట్టి బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో నిలిపేశారు. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు పునఃప్రారంభించారు. వారం రోజుల్లో పూర్తవుతాయని డీఈఈ తిరుపతిరావు, ఏఈ యోగేశ్వరరావు తెలిపారు.

చెత్త తరలించారు



టెక్కలి జిల్లా ఆసుపత్రిలో పొక్లెయిన్‌తో వ్యర్థాల తొలగింపు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చెత్తను గుట్టలుగా పోస్తుండటం, వాటిని సకాలంలో తరలించక పోవడంతో రోగులు ఇబ్బందులు పడేవారు. ఆవరణలో పందులు, పశువులు సంచరిస్తుండేవి. అధ్వాన పరిస్థితులపై 'పేరుకే పెద్దాసుపత్రి' శీర్షికతో ఈనెల 20న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు స్పందించారు. పొక్లెయిన్‌తో చెత్తకుప్పలను తొలగించి, ట్రాక్టర్ ద్వారా దూరప్రాంతాలకు తరలించారు.

రాచబంద గట్టు శుభ్రం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి పట్టణంలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని రాచబంద వ్యర్థాలతో అధ్వానంగా మారింది. రేవులోకి అడుగుపెట్టడానికి సైతం వీలుకాని పరిస్థితి. మెట్లపై చెత్త కుప్పలు పేరుకుపోయాయి. సమస్యపై 'చెత్తకుప్పలకు చిరునామా' శీర్షికన ఈనెల 22న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్పందించారు. రేవు మెట్ల మార్గంలోని వ్యర్థాలను కార్మికులతో తొలగించి శుభ్రం చేయించారు.

పరికరాలకు మరమ్మతులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడ, దండుగోపాలపురం, బోరుభద్ర, ఉమిలాడ, సంతబొమ్మాళి తదితర సచివాలయాల్లో మరమ్మతులకు గురైన బయోమెట్రిక్ పరికరాలను బాగు చేసినట్లు సంతబొమ్మాళి ఎంపీడీవో జయంత్‌ప్రసాద్ తెలిపారు. ఈనెల 9న 'వేలిముద్ర పడదు..వెతలు తీరవు' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. పనిచేయని పరికరాలను పంచాయతీ నిధులతో బాగు చేయించాలని ఆదేశించడంతో సిబ్బంది బాగు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన పాతపట్నం ఎమ్మెల్యే

పాతపట్నం, న్యూస్‌టుడే: వెనుకబడిన పాతపట్నం నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి నిధులు విడుదలలో అధిక ప్రాధాన్యమివ్వాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కలెక్టర్‌ను కోరారు. బుధవారం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరుకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలని, ఉపాధిహామీ పథకంలో ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. పాతపట్నంలో ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని చర్యలు చేపట్టాలన్నారు.


ప్రత్యేక ఫీజులు రద్దుచేయాలి

టెక్కలి పట్టణం: డిగ్రీలో ప్రత్యేక ఫీజుల్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చందు, హరీష్ కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కళాశాల ప్రిన్సిపల్ టి.గోవిందమ్మకు బుధవారం అందజేశారు. విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదలయ్యాకే కళాశాల ఫీజులు కట్టించుకోవాలన్నారు. సీపీడీసీ వంటి ప్రత్యేక ఫీజును నిలుపుదల చేసి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్జాన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి),న్యూస్‌టుడే: ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన యువకుడికి కొత్తపేట హెల్పింగ్ హేండ్స్ అసోసియేషన్ సభ్యులు చేయూత అందించారు. కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ సీతన్నపేటలో ఉంటున్న ఇప్పిలి త్రినాథరావుకు బుధవారం రూ.పదివేలు నగదు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇరానీ రాజు, రవి, సంతు పాల్గొన్నారు.

ఇసుక రేవు వద్ద కందకం



నరసన్నపేట, న్యూస్‌టుడే: రెండు రోజులుగా నరసన్నపేట మండలం మడపాం వద్ద వంశధార నదిలోని రేవుల నుంచి ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలిస్తున్న విషయం తెలిసిందే. మడపాం వద్ద రేవులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గ్రామస్థులు బుధవారం కందకం తవ్వారు. గ్రామంలో నుంచి వందలాది ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో మడపాం వద్ద ఇసుక రవాణా నిలిచిపోయింది.

తెరపై ఈనాడు

★ కీర్తన: వీక్షణం ★ కీర్తి: సత్యం సుందరం ★ కన్నెర సినిమాస్: ఇద్దరు ★ ఎన్వీవీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: లవ్ రెడ్డి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఆదిత్యుని సేవలో ఐఆర్ఎస్ అధికారి

అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామిని బుధవారం ఆదాయ పన్ను శాఖ ముఖ్య కమిషనర్ బి.శ్రీనివాస్ (విజయవాడ) దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో అర్చకులు వేదాశీర్వచనం పలికారు. ఈవో వై.భద్రాజీ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం





ప్రతిభ చూపారు

శ్రీకాకుళం నగరం గుజరాతీపేటలోని ఏపీ ఎంఎస్ఈ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. జి.హిమజ (పదో తరగతి), జి.రత్నశ్రీవల్లి (9వ తరగతి), టి.భానుతేజ (10వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఎవిపి మధుబాబు, యు.శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)




అంత్యక్రియలకు అగచాట్లు..!

సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల్లోని పలు గ్రామాల్లో శ్మశానవాటికలు ఉన్నా వాటికి మృతదేహాలను తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కిలో మీటర్ల మేర తుప్పలు, పొలాల గట్లపై నుంచి నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కొన్నేళ్ల కిందట శ్మశానవాటికలు నిర్మించినా ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో చెరువుల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఆమదాలవలస మండలం రామచంద్రపురంలో శ్మశానవాటిక (స్వర్గధామం)ను ఎంపీ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఏడేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు దాన్ని ప్రారంభించకపోవడంతో స్వర్గధామానికి వెళ్లేందుకు దారి లేక అక్కడ పక్కనే ఉన్న చెరువులో మృతదేహాలను దహనం చేయాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్గధామాన్ని వినియోగంలోకి తెస్తే వారికి ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు.





సరుబుజ్జిలి మండలంలోని సుభద్రాపురం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశానవాటిక దగ్గరకు వెళ్లాలంటే సుమారు అర కిలోమీటరు దూరం దాటి ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి రహదారి సదుపాయం లేకపోవడంతో పంట పొలాల గట్ల పైనుంచి వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో ఎవరైనా మృతి చెందితే ఇక్కడి ప్రజల అవస్థలు చెప్పుకోలేనివి. తీరా శ్మశానవాటిక వద్దకు చేరుకుంటే స్థల సమస్య పట్టి పీడిస్తోంది. దీంతో గుర్తించిన ఈ నిద్రగన్నేరు చెట్టు కిందనే మృతదేహాలను దహన పరుస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పరిశీలించి శ్మశానవాటికలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు, స్థల, రహదారి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. **–రామారావు ఈవోపీఆర్డీ, ఆర్.వెంకటరావు ఎంపీడీవో, సరుబుజ్జిలి, ఆమదాలవలస**



వసతి గృహంలోని స్టోర్ రూంను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహంలోని పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆమదాలవలస కోర్టులోని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి, వసతి, భోజనం, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, మరుగుదొడ్లు, విద్యార్థులు నిద్రించే గదులు, పరిసరాలను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులు చేపట్టాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం వివిధ దస్త్రాలను తనిఖీ చేశారు. వసతి గృహం వార్డెన్ షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సత్తా చాటారు..



ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. ఇందులో సీహెచ్.యామిని (10వ తరగతి), కె.ఢిల్లేశ్వరి (9వ తరగతి), బి.గణేష్ (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఎ.రాములు, ఉపాధ్యాయులు పి.మోహనరావు, పి.రామస్వామినాయుడు, షేక్ షావలి, బి.శరత్ కుమారి, బి.జనార్దనరావు, బి.సూర్యనారాయణలు ప్రశంసాపత్రాలు అందజేశారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

గొయ్యి పూడ్చారు..!

స్పందనకు వందనం

మున్సిపాలిటీ పరిధిలోని పార్వతీశంపేట జంక్షన్ వద్ద అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై కొద్ది కాలం కిందట ఏర్పడిన గొయ్యిని ఆర్అండ్‌బీ సిబ్బంది బుధవారం పూడ్చివేశారు. రహదారిలో ఉన్న దీని వల్ల ప్రయాణికులకు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్న విషయమై ఈ నెల 20న 'ఈనాడు'లో 'గొయ్యి పూడ్చరూ..!' శీర్షికతో సమస్య చిత్రాన్ని ప్రచురించడంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో ప్రయాణికులు, పుర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



వసతిగృహానికి కుళాయి ఏర్పాటు



పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న ఆదేశాల మేరకు బుధవారం పొందూరు మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహానికి తాగునీటి కుళాయిని పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ వసతి గృహాన్ని ఈ నెల 1న సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలను ఆమెకు తెలియజేశారు. దీంతో త్వరితగతిన వసతిగృహానికి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేయాలని అక్కడ ఉన్న పంచాయతీ కార్యనిర్వహణ అధికారి మోహన్‌బాబును ఆమె ఆదేశించారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు పైపులైన్‌ను వేసి కుళాయిని ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేశారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.

–న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

వ్యర్థాలతో అవస్థలు



శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధి ప్రభుత్వ సర్వజనాసుపత్రి నుంచి బలగ కుమ్మరి వీధికి వెళ్లే మార్గంలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టడం లేదు. ఆ ప్రాంతంలోని రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. అక్కడ పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఇండియన్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గత నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. పదో తరగతి విద్యార్థులు ఆర్.హేమశ్విని, పి.సాయివైష్ణవి లెవల్-1 పరీక్షకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త బాలరాజు, ప్రాంతీయ ఇన్‌ఛార్జి రామినాయుడు, జోనల్ డీన్ మోహన్‌బాబు, అకడమిక్ డీన్ కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ తదితరులు

మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమే

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆబ్కారీ శాఖ సహాయ సూపరింటెండెంట్ డీవీజీ రాజు అన్నారు. ఆదిత్య డిగ్రీ/పీజీ కళాశాలలో బుధవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత, నెహ్రూ యువ కేంద్ర యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఈఎస్ రాజు

సమస్యల పరిష్కారానికి పోరాటం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలశాఖలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసమే దశలవారీగా పోరాట కార్యక్రమాలు చేస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి అప్పారావు తెలిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు దేశ వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నట్లు ఆయన ఇక్కడ చెప్పారు. ఉద్యోగుల బదిలీ కాల పరిమితిని గతంలో మాదిరిగా నాలుగేళ్లుగా మార్చాలని, ఆచరణ సాధ్యం కాని పని భారాన్ని తగ్గించాలని తదితర సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటం చేస్తామన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు డీవీఈవో శివ్వాల తవిటినాయుడు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎం.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ సాహూ, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, అధ్యాపకులు గొండు శ్రీనివాసరావు, వినోద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తవిటినాయుడు

ఎస్కే నాయుడు మృతికి సంతాపం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు సిరిపురపు కన్నంనాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు. శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీలో ఎస్కే నాయుడు ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రసిద్ధ ఇంజినీరు పాగిరి సుగుణాకరరావు, సెట్‌శ్రీ విశ్రాంత సీఈవో సురంగి మోహనరావు, ఎంవీ పద్మావతి, డోల జగన్, పలువురు రాజకీయ నాయకులు, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు తదితరులు కొనియాడారు.



నివాళులర్పిస్తున్న సురంగి మోహనరావు తదితరులు

శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని డా. బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త ఎన్.బాలాజీ అన్నారు. ఎచ్చెర్లలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఫ్యూచర్ ఆన్ సైన్స్ ఫెయిర్ పేరిట బుధవారం గురుకుల పాఠశాలల జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొని అంతర్గతంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ఈ ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 9 గురుకుల పాఠశాలల నుంచి సైన్స్, గణితం, సోషల్ స్టడీస్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విభాగాల్లో మొత్తం 140 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వీటి నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 20 ప్రాజెక్టులను నిర్వాహకులు ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ప్రాంతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాల ప్రధానాచార్యులు ఎస్.పద్మజ, ఆర్ఐవో పి.దుర్గారావు, జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ, ఎంఈవో కారు పున్నయ్య, కొల్లివలస పాఠశాల ప్రధానాచార్యులు డి.దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా సమన్వయకర్త ఎన్.బాలాజీ, అధికారులు

ఉచిత వైద్య శిబిరం

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం తాడివలస పంచాయతీ లచ్చయ్యపేట గ్రామంలో శ్రీకాకుళానికి చెందిన డా.శశిధర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. వైద్యాధికారితో పాటు ఆర్గనైజర్ రాజ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యల పరిష్కారం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు సమస్యలు పరిష్కరించుకోవచ్చని మండల ఉపాధ్యక్షుడు గొవిందు వెంకట శివానందమూర్తి అన్నారు. మండలంలోని సింధువాడ గ్రామ సచివాలయం వద్ద స్థానిక సర్పంచి గోవిందు కామేశ్వరి అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మధుసూదన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: వరి పంటలకు సోకుతున్న చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం ఆమదాలవలస మండలం కొరపాం గ్రామంలో అధికారులు నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలు పొట్టదశలో ఉన్నాయని, వాటికి ప్రస్తుతం ఆశిస్తున్న చీడపీడలు, దోమలపై వివరించారు. వాటి నివారణకు ఎటువంటి మందులు పిచికారీ చేయాలో తెలిపారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వంద శాతం పనులు కల్పించండి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వంద శాతం పనులు కల్పించాలని డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఆమదాలవలస మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్రస్థాయి సహాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏపీవో లక్ష్మీనర్సమ్మ, ఈసీ రాము, క్షేత్రస్థాయి సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

29న స్వరమాధురి

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: ఈ నెల 29న రాగోలు వద్ద వాకలవలస అభయాంజనేయ స్వామి కల్యాణమండపంలో సాయంత్రం 5 గంటలకు స్వరమాధురి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఘంటసాల, ఎస్పీ బాలు, జి.ఆనంద్ స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు పి.జగన్మోహనరావు, డా.నిక్కు అప్పన్న, జి.వీర్రాజు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం జీబీఏ సంగీత స్వరమాధురి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా పలువురిని సత్కరించనున్నట్లు చెప్పారు.

రక్తదాన శిబిరానికి స్పందన

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రముఖ కథానాయకుడు ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని తెదేపా శ్రీకాకుళం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి శేఖర్, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై మక్కువ పెంచుకోండి



విద్యార్థికి పర్యాటక నమూనా అందజేస్తున్న నటుకుల మోహన్ తదితరులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యార్థులు పర్యాటక రంగంపై మక్కువ పెంచుకోవాలని ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి నటుకుల మోహన్ కోరారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో చరిత్ర, పర్యాటక విభాగాల విద్యార్థులు బుధవారం సదరన్ ట్రావెల్స్ సంస్థను సందర్శించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల చరిత్రను వివరించారు. సదరన్ ట్రావెల్స్ ఏజెన్సీ రెండు జిల్లాల ప్రతినిధి సీహెచ్ ఉత్తమకుమార్, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, అధ్యాపకులు ప్రతిష్ఠ, వరలక్ష్మి, రాజు, శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ప్రారంభమైన వర్సిటీ స్థాయి పోటీలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ ఎం.రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం అంబేడ్కర్ వర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడలను ప్రారంభించారు. పోటీలో విద్యార్థులు గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా క్రీడాపరిణితిని చూపాలన్నారు. ఐకమత్యం, సమానత్వం క్రీడల్లోనే సాధ్యపడుతుందన్నారు. విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.పప్పల కృష్ణారావు మాట్లాడుతూ..చదువుతోపాటు క్రీడలూ విద్యార్థులకు అవసరమేనన్నారు. క్రీడా కోటా ద్వారా ఉద్యోగాల్లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.శ్యామ్ బాబు మాట్లాడుతూ..విశ్వవిద్యాలయ స్థాయి పోటీలు పాలకొండలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులంతా ప్రతిజ్ఞ చేశారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శులు డా.ఎం.శ్రీనివాసరావు, డా.ఎ.భాస్కరరావు, ఎంఈవో కె.సోంబాబు, విశ్రాంత గ్రంథాలయ అధికారి కె.చౌదరినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వి.పుష్పనాథం, నారాయణమూర్తి, సీతారాం, రాములు, వెంకటరమణ, రాజు, శంకర్‌బాబు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

జి.సిగడాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా మండల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.